మురుగు సమస్యకు చెక్

లంగర్‌హౌస్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ గాంధీ చౌరస్తా నుంచి అలంకార్ థియేటర్ తదితర ప్రాంతాల్లో ఎనిమిది ఏళ్లుగా మురుగు పొంగిపొర్లుతుంది. దాదాపు కిలోమీటరు దూరం వరకు ఈ దుర్గంధ నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలంటూ సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో 'మురుగు సమస్యను పరిష్కరించండి సారూ' అనే శీర్షికతో ఈనెల 11న సాక్షిలో కథనం ప్రచురితమయ్యింది. స్పందించిన అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను తొలగించి, వాటి స్థానంలో పరిమాణం ఎక్కువగా ఉన్న పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

యాకుత్‌పురా: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-07 సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ శివకుమార్ తెలిపారు. బుధవారం ఆయన సర్కిల్ పరిధిలోని యాకుత్‌పురా, బడాబజార్, రెయిన్‌బజార్, ఎస్‌ఆర్టీ కాలనీ, తలాబ్‌కట్టా, భవానీనగర్, బీబీ బజార్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కమిషనర్, జోనల్ కమిషనర్ల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. స్థానిక ప్రజలు ఓపెన్ పాయింట్లల్లో చెత్త వేయకుండా సిబ్బందితో అవగాహన కల్పింస్తున్నామన్నారు.

ముతవల్లియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా మీర్ అబ్బాస్ అలీ మూస్వి

శాలిబండ: తెలంగాణ ముతవల్లియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆషూర్‌ఖానాల సంరక్షకుల సంస్థ అంజుమన్-ఏ-ముతవల్లియన్ అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ మూస్వి ఎన్నికయ్యారు. వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా అబ్బాస్ అలీ మూస్వి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికకావడం సంతోషంగా ఉందని, తనపై నమ్మకంతో ఎన్నుకున్న వారందరికీ, మత పెద్దలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మేరు కులస్తులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి

అబిడ్స్: మేరు కులస్తులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీ డాక్టర్ మల్లు రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీని మేరు కులస్తులు కలిసే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ ఇప్పిస్తే మేరు కులస్తుల సమస్యలు వివరిస్తామని, దాదాపు 20 లక్షల మంది ఉన్న మేరు కులస్తులకు చైర్మన్ పదవులు ఇవ్వాలని రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి, దేశ సంక్షేమం కొనసాగుతుందని రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కాక దేశ నలుమూలలా ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా, కిశోర్, నరేష్‌కుమార్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం ఆగాపురా ప్రాంతంలో ప్రజలకు సమస్యగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగింపజేసి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అంతరం డాక్టర్ మెట్టు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆగాపురా ప్రాంతంలో 15 ఏళ్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. గోషామహల్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ఆగాపురాలోని తమ కార్యాలయంలో చెబితే వెంటనే జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సన్మానం



జియాగూడ: ప్రధాని నరేంద్రమోదీ క్యాబినెట్‌లో 2వ సారి కేంద్ర మంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు జి.కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు గోపిశెట్టి ప్రమోద్ ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఆయనను కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి ప్రమోద్ మాట్లాడుతూ..కేంద్ర నిధులతో తెలంగాణ రాష్ట్రాన్ని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు కె.నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

యాకుత్‌పురా: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. బుధవారం జలమండలి ఎండీ, టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్లను కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రతిపాదించిన డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులపై స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు పూర్తి చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వివరించామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్ల ఏర్పాట్లపై విద్యుత్ శాఖ చైర్మన్, ఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీతో సమావేశమై చర్చించామన్నారు. రానున్న వర్షాలకు నాలాలు, వరదనీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశామన్నారు.

పెద్దషాపూర్ వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై అసంపూర్తిగా సర్వీసు రోడ్డు నిర్మాణం



నిత్య నరకం

రూ.300 కోట్లతో బెంగళూరు రహదారి విస్తరణ

- నత్తనడకన సాగుతున్న పనులు
- భూసేకరణలో జాప్యంతో ఇబ్బందులు
- రహదారిపై వాహనదారుల అవస్థలు

శంషాబాద్ రూరల్: బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి.. పనుల్లో జాప్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బెంగళూరు జాతీయ రహదారిపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నెలకొంది. చిన్న ప్రమాదం జరిగినా.. దారి పొడువునా కి.మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. పనుల కోసం రోడ్డుకు ఇరువైపులా తీసిన గోతుల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద భారీ వాహనాలు యూటర్న్ చేసే సమయంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది.

భారత్‌మాల పథకంలో..

మండలంలోని గండిగూడ నుంచి కొత్తూరు వై జంక్షన్ వరకు బెంగళూరు జాతీయ రహదారి(44)ను ఆరులేన్లకు విస్తరిస్తున్నారు. భారత్ మాల పరియోజన పథకంలో భాగంగా ఈ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ రహదారి నాలుగు వరసలుగా ఉండేది. ప్రస్తుతం ఆరు వరసలకు విస్తరించడంతో పాటు ఇరు వైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.300 కోట్లతో 11.8 కి.మీటర్ల మేర రహదారిని విస్తరిస్తున్నారు.

ఫ్లైఓవర్‌లు.. అండర్ పాస్‌లు..

ఈ మార్గంలో పలు చోట్ల ఫ్లైఓవర్ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడుతున్నారు. రహదారి శివారు గ్రామాల ప్రజలు సురక్షితంగా రోడ్డు దాటేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఘాంసిమియాగూడ, పాల్మాకుల వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మించనున్నారు. పెద్దషాపూర్, మదన్‌పల్లి, పీ-వన్ రోడ్డు సర్కిల్(పాల్మాకుల శివారు), తిమ్మాపూర్ వద్ద అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నారు. వీటితో పాటు సైడ్ డ్రైన్‌లు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు.



ఘాంసిమియాగూడ శివారులో అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణం

అసంపూర్తిగా భూసేకరణ..

రహదారి విస్తరణకు కావాల్సిన భూసేకరణ పూర్తి కాలేదు. ఇంకా 25 శాతం వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. దీంతో పనులు చేపట్టడానికి అడ్డంకులు ఎదురవుతున్నట్లు సమాచారం. తిమ్మాపూర్, పెద్దషాపూర్ వద్ద భూసేకరణ సమస్యలు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయడానికి కావాల్సిన భూసేకరణ నిలిచిపోయింది. దీంతో విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది. భూసేకరణ పూర్తయితే.. త్వరగా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసి.. వాహనదారులను సర్వీసు మార్గాల్లో మళ్లిస్తే.. ప్రధాన పనులకు ఇబ్బందులు తొలగిపోతాయని సంబంధిత కాంట్రాక్టు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

కొనసా...గుతున్న పనులు..

ఓ అడుగు ముందుకు.. మరో అడుగు వెనక్కు అన్నచందంగా విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల సైడ్‌డ్రైన్, కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. సర్వీసు రోడ్డు కోసం పనులు మొదలు పెట్టారు. ఫ్లైఓవర్, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. విస్తరణ పనుల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు పక్కన తీసిన గుంతల కారణంగా రహదారి ఇరుకుగా మారింది. ఎక్కడైనా ప్రమాదం జరిగితే.. రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి..



రహదారి పనులను త్వర గా పూర్తి చేస్తే ప్రజలకు కష్టాలు తప్పుతాయి. తర చూ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోతుంది. ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. చాలా రోజులు గా పనులు జరగడంలేదు. ఇప్పటికైనా అధికారు లు చొరవ తీసుకుని పనులను వేగవంతం చేయాలి.

–పి.శ్రీనివాస్‌రెడ్డి, పాల్మాకుల, శంషాబాద్.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



వట్టినాగులపల్లి పాఠశాలలో సమస్యలు తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాఠశాలలో మూత్రశాలలు, మరగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్‌లు, మంచి నీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీస సౌకర్యాలు లేక పోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని ఆమె దృష్టికి తెచ్చారు. త్వరలోనే పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చైర్ పర్సన్ హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చేందుకు కార్యాచరణ రూపొందించిందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామిరెడ్డి, ఎంఎస్‌ఓ విజయ్‌కుమార్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా విధులు నిర్వహించాలని వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శభరీష్ సూచించారు. గచ్చిబౌలిలోని జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయంలో మాన్‌సూన్ బృందాలతో ఆమె బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనునిత్యం అప్రమత్తంగా ఉండి అవసరమైన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా వర్షం వస్తే వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాలాల ఆక్రమణలను తొలగించాలని, వర్షపునీరు ఆటంకం లేకుండా ముందుకు సాగేలా చూడాలన్నారు. వర్షం పడితే అందరూ అందుబాటులో ఉంటూ రోడ్లను పరిశీలిస్తూ ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా వాహనదారుల రాకపోకలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాలాల్లో చెత్తా, ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తకుండా పలు విభాగాలతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ స్నేహశభరీష్

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

గచ్చిబౌలి: హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి హోంగార్డుల రాష్ట్ర సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఓడీ హోంగార్డులను దృష్టిలో ఉంచుకొని హోంగార్డుల నియామకం చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. హోంగార్డులను రెగ్యులరైజ్ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల అశోక ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, పీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.



ప్రజాపాలన కేంద్రం ప్రారంభం

మణికొండ: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పలు పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ తెలిపారు. గతంలో తప్పుగా దరఖాస్తులు చేసిన వారు వాటిని మరోసారి సరిచేసుకోవచ్చని, అవసరమైన వారు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

అత్తాపూర్: రోడ్డు ప్రమాదంలో భవన కార్మికుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వెంకటేష్ నగరానికి వలసవచ్చాడు. ఉప్పరపల్లిలో నివాసం ఉంటూ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి రోడ్డుపై వెళుతుండగా పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 175 వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలకు మరమ్మతులు

గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల సందర్భంగా డ్రైనేజీలకు మరమ్మతులు చేయిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గుడిమల్కాపూర్ డివిజన్‌లోని వివిధ బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. డ్రైనేజీలు, రోడ్లకు మరమ్మతు పనులు చేయాలని తాము గతంలో జలమండలి అధికారులను, బల్దియా అధికారులను కోరడం జరిగిందన్నారు. స్పందించిన జలమండలి మేనేజర్ నరేందర్, లైన్‌మెన్ కొమురయ్యతో కలిసి డ్రైనేజీలకు మరమ్మతులు చేయడమే కాకుండా ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌ను తొలగించి కొత్తవి వేస్తున్నారన్నారు. దుర్గాప్రసాద్, నవీన్‌ముదిరాజ్, మరాఠి నర్సింగ్, ఆనంద్‌యాదవ్ ఉన్నారు.

ఎస్‌ఎం హుస్సేనీ ముజీబ్‌కు సత్కారం



చార్మినార్: తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్‌ఎం హుస్సేనీ ముజీబ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్త మహ్మద్ ఒమర్ ఖాన్ బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవకు ముజీబ్ చేసిన విశేష కృషితో పాటు ఎన్నికలలో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారన్నారు. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించడంలో ఆయన అంకిత భావంతో పని చేశారన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు హైదరాబాద్ టీఎస్‌జీవోల అధ్యక్షుడిగా కొనసాగిన ఆయనకు కేంద్ర యూనియన్‌లో స్థానం లభించడం ఆయన చేసిన సేవలకు నిదర్శనమన్నారు.

రామచంద్రజీ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఆపండి

శంషాబాద్: పట్టణంలోని రామచంద్రజీభూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ఆపాలని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాతంరాయిలోని సర్వే నంబరు 668లో శ్రీ రామచంద్రజీ దేవాలయానికి సంబంధించిన 7.18 ఎకరాల భూమిలో ఇటీవల పూర్తి స్థాయిలో సర్వే చేపట్టగా పక్కనే ఉన్న త్రిలోక్ కన్‌స్ట్రక్షన్‌తో పాటు హిందుస్థాయి పెట్రోలియం బంకులో ఆలయ భూమి ఉన్నట్లు తేలిందన్నారు. సదరు భూమిని దేవాదాయ శాఖ ఇప్పటి వరకు స్వాధీనం చేసుకోకపోవడంతో భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, కౌన్సిలర్ పి. సంజయ్‌యాదవ్, సీనియర్ నాయకులు బండి శ్రీకాంత్, గుర్రం పల్లి లింగం యాదవ్ తదితరులున్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో అక్రమంగా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని, శిశుమందిర్ ప్రాంలో అభం కన్‌స్ట్రక్షన్ ఏర్పాటు చేస్తున్న ప్లాంట్‌ను కూల్చివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న వాటిని గుర్తించి కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు.



అక్రమంగా నిర్మించిన గోడను కూల్చివేస్తున్న దృశ్యం

సమాజ సేవను బాధ్యతగా భావించాలి

గోల్కొండ: సమాజ సేవను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. పదేళ్లుగా సమాజ సేవను సమర్థవంతంగా చేస్తున్న గోల్కొండకు చెందిన మహ్మద్ అశ్రత్‌కు బుధవారం ఆయన జ్ఞాపిక అందజేశారు. పేదలను ఆదుకోవడమే కాకుండా కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన కూలీలకు అండగా నిలిచిన మహ్మద్ అశ్రత్ నేటి యువతకు ఆదర్శమన్నారు.

ప్రత్యేక పూజలు

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న మహంకాళి అమ్మవార్లకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గోల్కొండ బోనాలు విజయవంతంగా జరిపిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడు సాయిబాబా చారి, పూజరులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

బండ్లగూడ: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసువస్తే వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కృషి చేస్తానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆమె పద్మశ్రీహిల్స్, రాధానగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, వీధి దీపాలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. నెల కొన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



పద్మశ్రీహిల్స్ కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిటిజన్ కౌన్సిల్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో రహదారుల విస్తరణ, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, ట్రాఫిక్ సమస్య, రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలని ది సిటిజన్స్ కౌన్సిల్ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. గురువారం జరగబోయే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను పెట్టి వాటిపై తీర్మానాలు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్ రావు, సహాయ కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, కోశాధికారి దిలీప్ కక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

శంషాబాద్: ఏఐసీసీ అగ్రనాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దేశానికి భవిష్యత్తు ప్రధాని రాహుల్ గాంధీ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, సీనియర్ మహిళా నాయకు రాలు మైలారం సులోచన, సీనియర్ నాయకులు బండి శ్రీకాంత్ యాదవ్ కౌన్సిలరుల శ్రీకాంత్‌యాదవ్ అమృత, బొబ్బిలి కిష్టయ్య, పిట్టల యాదయ్య, పరమేష్, గుంటి ప్రవీణ్‌కుమార్, రాచమల్ల జగన్, నజీరుద్దీన్, శ్రీధర్‌యాదవ్, అక్రమ్‌ఖాన్, జి. బి శ్రీధర్, దేవదాస్, శివముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, కిరణ్, రోహిత్, బండి పెంటయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

సీతారామ్‌బాగ్ జగన్నాథ మఠం పీఠాధిపతి మృతి

జియాగూడ: సీతారామ్‌బాగ్ జగన్నాథస్వామి ఆలయ మఠ పీఠాధిపతి త్రిదండి శ్రీనివాస వ్రతధర నారాయణ రామానుజ జీయర్ స్వామి (82) మంగళవారం హఠాన్మరం చెందారు. సీతారామ్‌బాగ్‌లో జగన్నాథస్వామి మఠాన్ని నెలకొల్పి స్వామీజీ అప్పటి నుంచి హిందూ ధర్మ పరిరక్షణ కోసం జగన్నాథస్వామి వృద్ధాశ్రమం, గోసేవా సంస్థాన్, భవనం, గురుకుల్ వేద విద్యాలయ, రంగనాథస్వామి మందిరం, శ్రీమన్నారాయణ శరాణాగతి ఆశ్రమం, భాగవత్ కథా పారాయణం, 108 లక్ష్మీ నారాయణ యజ్ఞాలు, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమాన్ దీక్ష, ఎన్నో ఆలయాల్లో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, మానవ సేవయే మాధవ సేవగా ఎన్నో సామాజిక సంస్థలు సహకరిస్తున్నాయని మహంతి అచ్యుత రామానుజ చార్య స్వామి తెలిపారు. పరమపదించిన స్వామి త్రిదండి శ్రీనివాస వ్రతధర రామానుజ స్వామి బృందావనంలో సమాధి చేశారు. నగర భోజనం, వైకుంఠ ఉత్సహం, చిన్నజీయర్ స్వామి ఆదేశానుసారం నిర్వహించడం జరుగుతుంది.



స్నేహితుడిపై రౌడీషీటర్ కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: మద్యం తాగుతున్న విషయంలో స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంలో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలీబాగ్‌కు చెందిన ఫెరోజ్(28), రౌడీషీటర్ ఫయాజ్ టక్కర్(38)లు స్నేహితులు. వీరిద్దరు మంగళవారం అర్ధరాత్రి చందూలాల్ బారదారిలో మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలోనే వీరిద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఆగ్రహానికి గురైన ఫయాజ్ టక్కర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఫెరోజ్ మెడపై దాడి చేసి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న శాలిబండ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.